చల్లంగా చూడు దుర్గమ్మ తల్లి

పూజలందుకుంటున్న అమ్మవారు

పాపన్నపేట, డిసెంబర్15: ఏడుపాయల పుణ్యక్షేత్రంలో కొలువైన వనదుర్గామాత సన్నిధిలో ఆదివారం పెద్దఎత్తున భక్తుల సందడి నెలకొన్నది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏడుపాయల ఈవో చంద్రశేఖర్, సిబ్బంది సూర్యశ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వర్ణాచారి, రాజు తదితరులు ఏర్పాట్లుచేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బందోబస్తు చేపట్టారు.

ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో భక్తులు

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోకి వెళ్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి, పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 5,855 మంది అభ్యర్థులకు 2,868 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 2859 మంది హాజరయ్యారు. ఆది, సోమవారాల్లో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నారు.

హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే ప్రజావాణి దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. సోమవారం నిర్వహించే ప్రజావాణిపై కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ -2 పరీక్షలకు విధుల్లో సంబంధిత శాఖల అధికారులు నిమగ్నమై ఉన్నందున అందుబాటులో ఉండరన్నారు. ప్రజలందరూ కలెక్టరేట్‌లోని హెల్ప్ డెస్క్‌లో ప్రజావాణి దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శివ్వంపేట, డిసెంబర్ 15: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా సంఘం నాయకులను చర్చలకు పిలిచి సమ్మె విరమింప చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షాలో కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పే స్కేల్ ఇవ్వాలని కోరుతూ కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. జిల్లా స్థాయిలో ఏపీవో, సిస్టమ్ అనలిస్ట్, టెక్నికల్ పర్సన్లు, ఆపరేటర్లు, డీఎంఎంటీ మెసెంజర్లు, మండల స్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీఎస్, మెసెంజర్లు, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సీఆర్‌పీలుగా, పాఠశాల స్థాయిలో పార్ట్ టైం వర్కర్లు, కేజీబీవీ యూఆర్ఎస్‌లో, స్పెషల్ ఆఫీసర్లు పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీలు, ఏఎన్ఎం, అకౌంటెంట్లు, క్రాఫ్ట్, కంప్యూటర్ ఇన్స్‌పెక్టర్లు, కుక్ వాచ్ ఉమన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు, 18 ఏండ్లుగా తక్కువ వేతనాలకే పని చేస్తున్నారన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా వేతనం పెంచడం లేదన్నారు. కనీసం ఆరోగ్య కార్డులు, మహిళలకు ప్రసూతి సెలవులు, జీవిత బీమా, చనిపోయిన ఉద్యోగ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగం వంటి సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

నర్సాపూర్, డిసెంబర్15: వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మున్సిపల్ పరిధి 9వ వార్డులోని వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్‌కు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మురుగునీరు కాల్వ నిర్మాణం, విద్యుత్ సరఫరా, తాగునీరు, సీసీ రోడ్డు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తానని, కొత్త నిర్మాణాలు చేపట్టడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో బీఆర్ఎస్ నాయకుడు బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, కాలనీ వాసులు చిన్న రమేశ్‌గౌడ్, ఆంజనేయులు, అశోక్‌గౌడ్, బుచ్చానాయక్, శంకర్‌నాయక్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి



రామాయంపేట, డిసెంబర్ 15: రామాయంపేట ఉమ్మడి మండలంలో పొగమంచు దట్టంగా కమ్ముకుంటున్నది. దీంతో చలి పెరిగింది. నాలుగు రోజులుగా ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. రోజూ సాయంకాలం ఐదు గంటల నుంచి మొదలైన చలి ఉదయం 8గంటల వరకూ పల్లె ప్రాంతాలను కప్పేస్తున్నది. దీంతో ప్రజలు తీవ్రంగా అనారోగ్యం బారిన పడుతున్నారు. రామాయంపేట, నిజాంపేట మండలాల్లో ఉష్ణోగ్రతలు 8.2 డిగ్రీలకు పడిపోవడంతో పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు వహించాలని వైద్యులు చెబుతున్నారు.

రామాయంపేట ఉమ్మడి మండలంలో పొగమంచు

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- చేతికి అందే ఎత్తులో వేళాడుతున్న విద్యుత్ తీగలు
- ఇండ్లపై నుంచి వెళ్తున్న తీగలు
- పొలాల్లో ఒక పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- విద్యుదాఘాతంతో తరచూ ప్రమాదాలు
- పొలాలకు వెళ్లాలంటేనే జంకుతున్న రైతులు
- విద్యుత్ తీగలు సరి చేయాలని కోరుతున్న ప్రజలు

మెదక్ రూరల్: ర్యాలామడుగులోని పొలంలో వేళాడుతున్న తీగలు

చిలిపిచెడ్: అజ్జమర్రిలో వేళాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

మెదక్ రూరల్, డిసెంబర్ 15: నిలబడితే తాకే ఎత్తులో వేళాడుతున్న విద్యుత్ తీగలను చూసి రైతులు, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. తప్ప వాటిని నిరంతరం పర్యవేక్షించడం లేదు. దీంతో విద్యుత్ షాక్‌తో ప్రమాదాలు తరుచూ జరుగుతున్నా సంబంధిత శాఖ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కోరినా పట్టించుకోవడం లేదు. మెదక్ మండలంలోని ర్యాలమడుగు గ్రామ శివారులో ఓ రైతు పొలంలో కొన్ని నెలలుగా విద్యుత్ తీగలు నిలబడితే తాకే ఎత్తులో వేళాడుతున్నాయి రైతులు విద్యుత్ తీగలతో పంటను ఎట్లా సాగు చేయాలని వాపోతున్నాడు . ఈ విద్యుత్ తీగలు, స్తంభాలను సరి చేయాలంటూ పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

విద్యుత్ తీగలను సరిచేయాలి

చిలిపిచెడ్, డిసెంబర్ 15: గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండడంతో ప్రజలు, రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ఈదురు గాలులు వస్తే స్థానికులు, రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు చేస్తుండగా ఎప్పుడు కరెంట్ తీగలు తెగి మీదపడుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కరెంట్ సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు అడిగినా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిలిపిచెడ్, గౌతాపూర్, చిట్కుల్, అజ్జమర్రి, గిరిజన తండాలో ఇంటి పై నుంచి, రైతుల పొలాల్లోంచి, చెట్టు కొమ్మలపై నుంచి విద్యుత్ తీగలు వెళాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కొంత మంది పొలాల్లో భూమికి తాకేలా ప్రమాదకారంగా విద్యుతు తీగలు ఉన్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుగా ప్రమాదం జరిగిన తర్వాత విద్యుత్ అధికారులు స్పందిస్తున్నారు. మండలంలోని రైతులు విద్యుత్ తీగలను సరి చేయాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యాసంగి ప్రారంభం కాకముందే విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మెదక్ రూరల్: ప్రమాదకరంగా వంగిన విద్యుత్ స్తంభం

చిలిపిచెడ్‌లో ఓ ఇంటి రేకులను తాకుతూ వెళ్తున్న విద్యుత్ తీగలు

నియోజకవర్గానికి 108 వాహనాలు మంజూరు

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, డిసెంబర్15: కొల్చారం, వెల్దుర్తి మండలాలకు 108 వాహనాలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో కొల్చారం-నర్సాపూర్ ప్రధాన రహదారిపై చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, 108 వాహనాలు అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోతున్నారని, అంబులెన్సులు ఇవ్వాలని వైద్య శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరిక మేరకు స్పందించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ కొల్చారం, వెల్దుర్తి మండలాలకు 108 అంబులెన్సులను మంజూరు చేశారన్నారు.

శివ్వంపేట: కొంతాన్‌పల్లిలో అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి: మాసాయిపేటలో అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే

శివ్వంపేట, డిసెంబర్ 15: మండలంలోని కొంతాన్‌పల్లిలో గురుస్వామి ప్రవీణ్‌కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరయ్యారు. స్వామివారికి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వాహకులు సన్మానించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయూమొద్దీన్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఉన్నారు.

అంబులెన్స్ ప్రారంభం

వెల్దుర్తి, డిసెంబర్ 15: మాసాయిపేట మండలానికి మంజూరైన అంబులెన్స్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆర్ఐ ధన్‌సింగ్, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, సిద్దిరాంలుగౌడ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో ప్రభుత్వ లక్ష్యం

- ఒక్కో వైకుంఠధామానికి రూ.10 లక్షల ఖర్చు
- ఉమ్మడి మండలంలో 29 వైకుంఠధామాలు నిర్మించిన కేసీఆర్ ప్రభుత్వం
- ప్రస్తుతం ముళ్లపొదలతో నిండిన శ్మశానవాటికలు

నిజాంపేట మండలంలోని నందిగామలో ముళ్లపొదలతో నిండి ఉన్న వైకుంఠధామం

రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం

రామాయంపేట, డిసెంబర్ 15: ప్రతి గ్రామంలో చివరి మజిలీ సజావుగా సాగాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో గ్రామానికి లక్షలాది రూపాయలు వెచ్చించి వైకుంఠధామాలు నిర్మించింది. రామాయంపేట ఉమ్మడి మండలంలో 29 వైకుంఠధామాలు నిర్మించింది. ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరించడంతో ప్రజల ఆకాంక్షలు నెరవేరడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఉమ్మడి మండలంలో ఒక్క రూపాయి పని కూడా మొదలు కాలేదు. రామాయంపేట ఉమ్మడి మండల వ్యాప్తంగా కేసీఆర్ ప్రభుత్వం పల్లె పల్లెకు శ్మశాన వాటికలు నిర్మించింది. రామాయంపేట మండలంలో 15, నిజాంపేట మండలంలో 14 వైకుంఠధామాలు నిర్మించింది. ప్రజలకు సౌకర్యంగా ఉండాల్సిన వైకుంఠధామాలు కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యంగా మారాయి. 29 వైకుంఠధామాల్లో ఏ గ్రామానికి వెళ్లినా వాటిని ఉపయోగంలోకి తీసుకురావడంలో, వసతులు కల్పించడంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలమైందని స్థానికులు పేర్కొంటున్నారు. వైకుంఠధామాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. నీటి కొరత మూలంగా ప్రజలకు ఉపయోగంలో లేకుండా పోతున్నాయి. ప్రభుత్వం వైకుంఠధామాలను పట్టించుకోవడమే గాకుండా రోడ్డు సౌకర్యం, నీటి కొరత లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఎస్టీ హాస్టల్ భవనం

శిథిలావస్థలో ఎస్టీ హాస్టల్ భవనం

భవనం పైకప్పు పెచ్చులూడిపోయిన దృశ్యం

శిథిలావస్థలో భవనం పై కప్పు

- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న విద్యార్థులు
- భయాందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 15: చిన్నశంకరంపేటలోని ఎస్టీ హాస్టల్ భవనం శిథిలావస్థలకు చేరింది. పైకప్పు పెచ్చులూడుతున్నది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొన్నది. వర్షం వస్తే నీరంతా గదుల్లోకి చేరే పరిస్థితి నెలకొన్నది. దీంతో విద్యార్థులు దినదిన గండంగా కాలం వెళ్లదీస్తున్నారు. అప్పుడప్పుడు భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయని విద్యార్థులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్లో ఏ గదికి వెళ్లినా పైక ప్పు పెచ్చులూడిపోయి దర్శనమిస్తాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మరమ్మతులు చేపట్టి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలంటున్నారు. శిథిలావస్థకు చేరిన భవనా న్ని తొలిగించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు

హాస్టల్ గదిలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. భవనం పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. భవనానికి మరమ్మతులు చేయించి, ప్రమాదాలు జరగకుంగా చూడాలి.

- రాజు, విద్యార్థి

నూతన భవనాన్ని నిర్మించాలి

హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. హాస్టల్ గదుల్లో ఉండాలంటే ప్రాణాలు అరి చేతిలో పెట్టుకుని ఉండాల్సి వస్తున్నది.

- అభిలాష్, విద్యార్థి

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

ఆంజనేయులు (ఫైల్)

శివ్వంపేట, డిసెంబర్ 15: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెన్నాపూర్ గ్రామానికి చెందిన ముద్దంగుల ఆంజనేయులు (32) నాలుగు ఏండ్ల నుంచి తన భార్య కాపురానికి రావడం లేదని బాధపడుతుండేవాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో రాత్రి ఒంటి గంటకు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాగా అరవడంతో కుటుంబసభ్యులు వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తమ్ముడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెటర్నరీ అధికారుల ఇంటింటి సర్వే

సర్వే చేపడుతున్న వెటర్నరీ అధికారులు

నిజాంపేట, డిసెంబర్ 15: నిజాంపేటలో వెటర్నరీ అధికారులు ఇంటింటి సర్వేను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ అధికారులు సిద్ధిరాములు, రవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇండ్లల్లో పెంచుకుంటున్న కోళ్లు, గేదెలు, జీవాల సంఖ్య వివరాలను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదికగా అందిస్తామన్నారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు

రేగోడ్, డిసెంబర్ 15: జగిర్యాల గ్రామంలో బండ్లను అందంగా అలంకరించి మల్లన్న స్వామి ఆలయం చుట్టూ ప్రదర్శన చేశారు. ఆయా గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT MEDAK.
O.S.No. 368 of 2024
Between:
1. Smt. Allenki Bhagyamma
2. Allenki Santhosh
3. Allenki Rupesh
4. Adharapu Padma
5. Vitta Shobarani ...Plaintiffs
AND
1. The Tahsildar, Medak Mandal
2. To whomsoever it may concern.
...Defendants
NOTICE
To
Whosoever it may concern
Pleased to take notice that the above said named plaintiffs has filed the above suit for Declaration Declaring the plaintiffs are legal heirs of deceased Allenki Eshwaraiah who is the father of the plaintiff No. 2 to 4 and husband of Plaintiff No.1.
If any person or persons have any objections they may appear personally or through counsel on 02-01-2025 at 10:30 A.M before the Hon'ble Principal Junior Civil Judge at Medak otherwise the Hon'ble court will proceed according to law.
Hence this Notice.
Sd/- G.SANTHOSH REDDY
Y.DAMODAR REDDY
Advocates, Medak
Cell: 9848020507